# చిరస్మరణీయుడు సర్వాయి పాపన్న

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వర్ధంతి
- నివాళులర్పించిన అధికారులు

సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, అధికారులు

వికారాబాద్, ఏప్రిల్ 2 : తెలంగాణలో మొట్ట మొదటి బహుజన చక్రవర్తిగా పేరుగాంచిన సర్వాయి పాపన్న గౌడ్ చిరస్మరణీయుడని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీనవర్గాలు సర్వాయి పాపన్న పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బహుజన రాజ్యాన్ని స్థాపించిన మొట్ట మొదటి మహాయోధున్నారు. ఆయన సాధారణ కుటుంబంలో జన్మించి పశువుల కాపరిగా, గీత కార్మికుడిగా తన ప్రస్థానంలో భాగంగా అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా పోరాటం సలిపిన మహాయోధుడని తెలిపారు. ఎలాంటి అండదండలు లేకుండా బడుగు కులాలను ఏకం చేసి భూస్వాములు, మొగల్‌లు శిస్తుల రూపంలో పన్నుల వసూళ్ల పేరుతో ప్రజలను పీడిస్తున్న క్రమంలో వారికి అండగా నిలిచి పోరాటం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, డీబీసీడీవో ఉపేందర్, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి అధికారులు మల్లేశం, కమలాకర్ రెడ్డి, డీపీవో జయసుధ, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, మిషన్ భగీరథ ఈఈ చల్మారెడ్డి, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్‌వైవీఎస్ అమలులో అప్రమత్తంగా ఉండాలి

వికారాబాద్, ఏప్రిల్ 2 : రాజీవ్ యువ వికాస పథకం (ఆర్‌వైవీఎస్) అమలులో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఎంపీడీవో, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మండల కేంద్రంలో రాజీవ్ యువ వికాస కేంద్రం ఏర్పాటు చేసి, రాజీవ్ యువ వికాస కేంద్రాల ద్వారా లబ్ధిదారుల నుంచి ఈ నెల 14వరకు దరఖాస్తులు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు సంబంధించి కుల, ఆదాయ, ధ్రువకరణ పత్రాలను తహసీల్దార్లు వెంటనే జారీ చేయాలన్నారు. రూ.50వేల వరకు లబ్ధిపొందిన వారికి వారం, రూ.50వేల నుంచి రూ.2లక్షల వరకు లబ్ధిపొందిన వారికి 15 రోజులు, రూ.2లక్షల నుంచి రూ.4లక్షల వరకు ప్రయోజనం పొందిన వారికి నెల రోజులు శిక్షణ నిర్వహించి, అనంతరం నగదు అందజేయాలన్నారు. జూలై మొదటి వారం వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. నిరుద్యోగ యువకులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా వారి సమస్యలను పరిష్కరించేందుకు ఓ యువ అధికారిని నియమించాలన్నారు. అనంతరం సన్నబియ్యం పంపిణీపై అధికారులతో సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, డీఆర్‌డీవో శ్రీనివాస్, అధికారులు నవీన్, హనుమంతు రావు, కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గస్తీ లేదు.. నిఘా కరువు

సిటీబ్యూరో: రోజుకో హత్య లేక ఎక్కడో ఒకచోట మహిళలకు వేధింపులు.. ఇవి చాలవన్నట్లు కిడ్నాప్‌లు.. అడపాదడపా దోపిడీలు, దొంగతనాలు.. .. ఈజీగా మారిన గన్‌ఫైరింగ్.. ఒకటేమిటి.. అన్ని నేరాలకు కేరాఫ్‌గా గ్రేట్ హైదరాబాద్ మారిపోయింది. 2023 నుంచి 2024కు క్రైమ్ రేట్ కొంతమేరకు పెరిగితే ఈ ఏడాది మొదటి మూడు నెలల్లోనే సుమారు 166కిపైగా హత్యలు, దొంగతనాలు తదితర ప్రధాన నేరాలు జరుగుతున్నా..చిన్నాచితకా నేరాల లెక్క వీటికి రెట్టింపు సంఖ్యలో నమోదయ్యాయి. ఇక మహిళలపై వేధింపుల ఘటనలు 86 వరకు నమోదైనట్లు పోలీసులు చెప్పారు. అసలు కమిషనరేట్‌లో పోలీసింగ్ పట్టు తప్పుతోందా.. లేక నేరస్తుల్లో భయం తగ్గుతోందా.. అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణాలోపంతో పోలీసుల నుంచి బాధితులకు స్పందన రావడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

### పోలీస్ గస్తీ కనిపించడంలేదు..!

పదేళ్ల పాటు రాష్ట్రంలో శాంతిభద్రతల స్థాపనే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పోలీసింగ్‌పై దృష్టిపెట్టింది. మహిళల రక్షణ కోసం షీటీమ్స్ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సీసీ కెమెరాలు లేని సమయంలో పోలీసు గస్తీ ముమ్మరంగా ఉండి నేరాల నియంత్రణ, శాంతిభద్రతల నిర్వహణ సుస్థిరంగా ఉండేది. ప్రస్తుతం అప్పుడప్పుడు పోలీసుల గస్తీ కొన్ని చోట్ల కనిపించినా వారు పెద్దగా రోడ్డుపై ఏం జరుగుతుందో పట్టించుకునే పరిస్థితిలో లేరనే విమర్శలున్నాయి. తాజా పరిణామాలు చూస్తే పెరుగుతున్న క్రైమ్‌రేట్ ను బట్టి హైదరాబాద్ మరో బీహార్‌గా మారుతుందా అన్న అనుమానం తలెత్తుతోంది.

### ఫీడ్‌బ్యాక్ సెంటర్లకు స్వస్తి..!

తెలంగాణ ఏర్పాటు తర్వాత పోలీసింగ్‌కు ఆనాటి ప్రభుత్వం చాలా ప్రాధాన్యతనిచ్చింది. అందులో ప్రధానంగా ప్రతీ కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు చేసిన ఫీడ్‌బ్యాక్ సెంటర్లు ఫిర్యాదుదారుల నుంచి తీసుకునే ఫీడ్ బ్యాక్ కీలకమయ్యేది. గతంలో నేరాలు చేసిన వారు ప్రస్తుతం ఏం చేస్తున్నారంటూ ఎప్పటికప్పుడు వారిపై నిఘా పెట్టే వ్యవస్థ కూడా సరిగా లేకపోవడంతో ఇటీవల జరిగిన చాలా నేరాల్లో పాత నేరస్తులే మళ్లీ మళ్లీ నేరాలకు పాల్పడుతున్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు.

### విజిబుల్ పోలీసింగ్‌తోనే నేరాలకు చెక్

విజిబుల్ పోలీసింగ్‌తోనే నేరాలు అరికట్ట వచ్చని పోలీస్ ఉన్నతాధికారులు సిబ్బందికి సూచనలు చేస్తున్నారు. విదేశీ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన యాకత్‌పురాకు చెందిన మహ్మద్ అబ్దుల్ అస్లాంపై గతంలోను కేసులున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడయ్యింది. జర్మనీ విద్యార్థినికి హైదరాబాద్‌ను చూపిస్తానంటూ నమ్మించి కారులో ఎక్కించుకొని వెళ్లి పహాడీషరీఫ్ ప్రాంతంలో అఘాయిత్యానికి పాల్పడిన కామాంధుడిని మంగళవారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

# న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

### బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బస్వరాజ్

నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను సన్మానిస్తున్న న్యాయవాది శుభప్రద్‌పటేల్

వికారాబాద్, ఏప్రిల్ 2 : న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వికారాబాద్ బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్.బస్వరాజ్, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం వికారాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా బస్వరాజ్, ప్రధాన కార్యదర్శిగా పోలీస్ వెంకట్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఆనంద్, మహిళ ప్రధాన కార్యదర్శిగా వసుంధర, కోశాధికారిగా మోహన్‌రాథోడ్, గ్రంథాయ కార్యదర్శిగా సాయిరాం, క్రీడల కార్యదర్శిగా రమేశ్, సభ్యులుగా పరశురాంనాయక్, అయూబ్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోర్టు భవన నిర్మాణం కోసం బార్ అసోసియేషన్ తరపున కృషి చేస్తామన్నారు. న్యాయవాదులకు రావాల్సిన ఆలవెన్సులను వచ్చేలా ప్రయత్నిస్తామన్నారు. జూనియర్ న్యాయవాదులకు క్విజ్ పోటీలు నిర్వహించి వారిని ప్రోత్సహించాలన్నారు. పోటీల్లో విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేయాలన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సభ్యులను న్యాయవాదులు సన్మానించారు. కార్యక్రమంలో మాధవరెడ్డి, అశోక్, నాగేందర్‌గౌడ్, శుభప్రద్‌పటేల్, నాగరాజు, శ్రీనివాస్, వెంకటేశం, కిరణ్‌పటేల్ పాల్గొన్నారు.

## సర్దార్ ఆశయ సాధనకు కృషి చేయాలి

సర్వాయి పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్‌వో సంగీత, అధికారులు

ఆదిబట్ల, ఏప్రిల్ 2 : సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి సంగీత అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సర్వాయి పాపన్న వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌వో ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్వాయి పాపన్న తెలంగాణ వీరుడని తెలంగాణ ప్రజల ఆత్మగౌరవమని కొనియాడారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి కేశురాం, కలెక్టరేట్ ఏవో సునీల్, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు రమేశ్, మాధవరెడ్డి, కుల సంఘం నేతలు బోయపల్లి సుధాకర్ గౌడ్, నర్సింహాగౌడ్, బండి రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

మట్టి తింటూ నిరసన తెలుపుతున్న వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ తదితరులు

పరిగి, ఏప్రిల్ 2 : రాజ్యాధికారానికి దూరమైన దివ్యాంగులకు మంత్రివర్గ విస్తరణలో అవకాశం కల్పించాలని, వికలాంగుల సంక్షేమం కోసం రూ.3వేల కోట్లతో ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ డిమాండ్ చేశారు. బుధవారం పరిగిలో మట్టి తింటూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చి గద్దె నెక్కిన తర్వాత రేవంత్‌రెడ్డి 15 నెలల కాలంలో దివ్యాంగుల సంక్షేమం కోసం చేసింది శూన్యమన్నారు. దివ్యాంగుల పింఛన్‌ను రూ.6వేలకు పెంచడంతోపాటు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలన్నారు. స్థానిక సంస్థలలోను దివ్యాంగులకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ సదుపాయం కల్పించాలన్నారు. గతంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పోతురాజు, నాయకులు లక్ష్మయ్య, చంద్రయ్య, చుక్కయ్య, గణేశ్, చంద్రశేఖర్‌రెడ్డి, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## పంచాయతీ కార్మికుల వేతనాలు విడుదల చేయాలి

పరిగి, ఏప్రిల్ 2 : గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పరిగిలోని మండల పరిషత్ కార్యాలయం ముందు గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024 జూలై నుంచి డిసెంబర్ వరకు పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. సీఎం ప్రకటించినట్లు గ్రీన్ ఛానల్ ద్వారా 2025 జనవరి నుంచి వేతనాలు చెల్లించాలన్నారు. జీవో 51 అనుసరించి మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, పాత కేటగిరీలను కొనసాగించాలన్నారు. గ్రామ పంచాయతీ వర్కర్ల వేతనాలను రూ.18వేలకు పెంచాలని, రూ.10లక్షలు బీమా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఏ రోజు నుంచైనా రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మెకు వెళ్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల మండల అధ్యక్షుడు నర్సింహులు, నాయకులు రామస్వామి, వెంకటయ్య, యాదయ్య, నర్సింహులు, శ్రీను, సుక్కమ్మ, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల అదుపులో ఎల్‌హెచ్‌పీఎస్ నేతలు

కేశంపేట : పోలీసుల అదుపులో ఎల్‌హెచ్‌పీఎస్ నేతలు

కేశంపేట, ఏప్రిల్ 2 : రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడీలకు స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎల్‌హెచ్‌పీఎస్ (లంబాడి హక్కుల పోరాట సమితి) సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా బుధవారం అదుపులోకి తీసుకున్నారు. కేశంపేట మండలంలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామ సమీపంలో ఉన్న ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ నివాసానికి చేరుకొని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రాంబల్‌నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడీలకు స్థానం కల్పించకపోవడం దారుణమన్నారు. తమ హక్కును తెలియజేయాలన్న ఉద్దేశంతో సీఎం ఇంటి ముట్టడికి పిలుపునిస్తే అరెస్టు చేసి స్టేషన్‌లో నిర్బంధించడం దారుణమన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే రాష్ట్ర మంత్రివర్గంలోకి లంబాడీలను తీసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అరెస్టు చేసిన ఎల్‌హెచ్‌పీఎస్ కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. పోలీసుల అదుపులో మండల ప్రధాన కార్యదర్శి దేవుజానాయక్ ఉన్నారు.

### బంజార నాయకుల ముందస్తు అరెస్టు

**మాడ్గుల :** లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలంటూ సేవాలాల్ బంజారా సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిరాహార దీక్ష చేపడుతూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చారు. అందులో భాగంగా మండలానికి చెందిన బంజార సంఘం మండల అధ్యక్షుడు జర్పుల విజయ్ కుమార్, రాజునాయక్‌ను మాడ్గుల పోలీసులు బుధవారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మాడ్గుల : పోలీసుల అదుపులో బంజార నాయకులు

# యూనివర్సిటీ భూములను కాపాడాలి

ఇబ్రహీంపట్నం : పోల్కంపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పరిగి: ర్యాలీలో పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య, నాయకులు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 2 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడాలని సీపీఎం పోల్కంపల్లి కార్యదర్శి ఆమ నగంటి నర్సింహ అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన సీపీఎం నాయకుల అక్రమ అరెస్టులకు నిరసనగా బుధవారం ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లిలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు, విద్యార్థి సంఘం నాయకులు నిర్వహిస్తున్న పోరాటానికి ప్రజాస్వామ్యవాదుల మద్దతు ఇచ్చి భావితరాల కోసం 400 ఎకరాల సెంట్రల్ యూనివర్సిటీ భూమిని రక్షించాలన్నారు. భూమిని వేలం వేసే అంశాన్ని వెంటనే విరమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు స్వామి, యాదయ్య, కరుణాకర్‌రెడ్డి, ఇస్తారి, వెంకన్న, బాలయ్య, శ్రీనివాస్, దనేశ్వర్, యాదయ్య, నవీన్, పాండు తదితరులున్నారు.

### భూముల విక్రయ ఆలోచనను విరమించుకోవాలి

**పరిగి :** 400 ఎకరాల యూనివర్సిటీ భూమిని ప్రభుత్వం అమ్మకానికి పెట్టే ప్రయత్నాన్ని వెంటనే విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య డిమాండ్ చేశారు. భూముల వేలాన్ని ఆపాలని, పర్యావరణాన్ని కాపాడాలని, విద్యార్థి నాయకులపై పెట్టిన నిర్బంధాన్ని నిరసిస్తూ.. సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం పరిగిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. విశ్వ విద్యాలయాలు, విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన దశలో ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదన్నారు. యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని ప్రభుత్వం వెనక్కి తీసుకొని అమ్మకానికి పెట్టిందన్నారు. ప్రభుత్వ చర్యకు నిరసనగా విద్యార్థులు ఆందోళన చేస్తే పోలీసులు ఇష్టానుసారంగా కొట్టారని ఆయన ఆరోపించారు. ధర్నాకు పిలుపునిస్తే నిర్బంధం కొనసాగిస్తూ అర్ధరాత్రి సమయాల్లో అరెస్టు చేశారని విమర్శించారు. వెంటనే భూముల వేలం ఆలోచనను విరమించుకోవడంతోపాటు అరెస్టు చేసిన విద్యార్థులను విడుదల చేయాలని, వారిపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బస్సు చంద్రయ్య, నాయకులు హబీబ్, సత్తయ్య, యాదగిరి, మహిపాల్‌రెడ్డి, రఘురాం, సత్యయ్య, విజయ్, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### భూముల వేలాన్ని ఆపాలి

**బొంరాస్‌పేట :** హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన భూముల వేలాన్ని ప్రభుత్వం అపాలంటూ దుద్యాల్ మండల కేంద్రంలో సీపీఎం జిల్లా నాయకులు బుస్స చంద్రయ్య అధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన ప్రభుత్వమే ఇలా చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్న విద్యార్థులపై పోలీస్‌లు లాఠీచార్జి చేయడం, వారిని నిర్భంధించడంతో పాటు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. మంగళవారం యూనివర్సిటీ గేట్ దగ్గర శాంతియుతంగా నిరసనకు సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపునిస్తే అర్ధరాత్రి సీపీఎం నాయకులను హౌజ్ అరెస్ట్ చేయడం సరికాదన్నారు. 400 ఎకరాల యూనివర్సిటీ భూమిని ప్రభుత్వం అమ్మకానికి పెట్టిందని దానిని వెంటనే విరమించుకోవాలని, యూనివర్సిటీ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. విద్యార్థులపై పెట్టిన అక్రమకేసులను కొట్టివేసి, వారిని విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లయ్య, పెంటప్ప, గంగమ్మ, కిష్టప్ప, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట : నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

# సాయిరెడ్డి చెరువుకు మహర్దశ

- ప్రతిపటా 300 మిలియన్ లీటర్ల నీటిని నింపేందుకు ప్రణాళిక
- సే ట్రీస్ సహకారంతో పునరుద్ధరణ పనులు చేపట్టనున్న అమెజాన్
- 10 నుంచి 33 ఎకరాలకు పెరగనున్న చెరువు ఉపరితలం
- హర్షం వ్యక్తం చేస్తున్న కొత్తూరు మున్సిపాలిటీ ప్రజలు

సాయిరెడ్డి చెరువు పునరుద్ధరణ కోసం సర్వే చేపడుతున్న అమెజాన్ నిపుణులు

కొత్తూరు, ఏప్రిల్ 2 : కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని సాయిరెడ్డి చెరువు రూపురేఖలు మారనున్నాయి. ఈ చెరువు పునరుద్ధరణకు అమెజాన్ సంస్థ ముందుకొచ్చింది. స్థానిక పర్యావరణ సంస్థ సే ట్రీస్ సహకారంతో చెరువు పునరుద్ధరణ కోసం సర్వే పనులు మొదలుపెట్టింది. ఈ చెరువు కొత్తూరు తండాను ఆనుకొని ఉంది. వర్షం కురిసిన సమయంలో చెరువులోకి వచ్చే నీటి మార్గాలు చాలా వరకు కబ్జాకు గురయ్యాయి. మున్సిపాలిటీకి దగ్గరగా ఉండటంతో డంపింగ్ యార్డుగా మార్చి చెత్త చెదారంతో చెరువు కుంచించుకుపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో చెరువును పునరుద్ధరించి పూర్వవైభవం తీసుకొస్తామంటూ అమెజాన్ సంస్థ ముందుకొచ్చింది. స్థానిక పర్యావరణ సంస్థ సే ట్రీస్ సహకారంతో చెరువు పునరుద్ధరణ చేపడతామంటున్నది. 33 ఎకరాల్లో ఉన్న చెరువు ప్రస్తుతం 10 ఎకరాల్లో మాత్రమే నీటిని నింపేందుకు అనువుగా ఉంది. చెరువు పునరుద్ధరణ పనులు చేపట్టి 33 ఎకరాల్లో నీటిని నింపేలా చర్యలు తీసుకుంటామని అమెజాన్ ప్రతినిధులు తెలిపారు. ప్రతి ఏటా 300 మిలియన్ లీటర్ల నీటిని నింపేలా పునరుద్ధరణ పనులు చేపడుతామని వారు చెబుతున్నారు.

చెరువు పై భాగంలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో చేపట్టిన నిర్మాణాలు

### ఆక్రమణలు తొలగించాలి..

చెరువులు పునరుద్ధరణ కోసం అమెజాన్ సంస్థ ముందుకు రావడం అభినందనీయమని స్థానికులు చెబుతున్నారు. ఇందు కోసం అధికారులు సహకరించాలని కోరుతున్నారు. మొదట చెరువు పై భాగంలో ఉన్న చాలా పరిశ్రమలు, రియల్టర్లు చెరువును కబ్జా చేశారని చెబుతున్నారు. కబ్జాలను తొలగిస్తే చెరువు పునరుద్ధరణకు మార్గం సుగమమవుతుందని చెబుతున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు మొదట కబ్జాలను తొలగించి పునరుద్ధరణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

# నిధులు పక్కదారి.. ఆందోళనకు సిద్ధమైన విపక్షాలు

తాండూరు, ఏప్రిల్ 2 : పేదలకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు పక్కదారి పడుతున్నాయి. నాయకులతో అధికారులు కుమ్మక్కై ఎంజీఎన్‌ఆర్ఈజీఎస్ నిధులను తాండూరు నియోజకవర్గంలో పక్కదారి పట్టిస్తున్నారు. యాలాల మండల పరిధిలోని కోకట్ గ్రామ పంచాయతీ పరిధిలో రోడ్ల నిర్మాణానికి ఈ నిధులు రూ.60 లక్షలను ప్రభుత్వం కేటాయించింది. ఎక్కడ వేస్తున్నారు... ఎలా వేస్తున్నారు అని చూడకుండా సంబంధిత శాఖ అధికారులు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమోదం తెలిపారు. ఈ రూ.60 లక్షల నిధులను కాంగ్రెస్ నాయకులు దుర్వినియోగం చేశారు. తాండూరు మున్సిపల్ పరిధిలోని వార్డు నంబర్ 11 కోకట్ శివారులోని ప్రైవేట్ ప్లాట్లు, కాంగ్రెస్ నాయకుడు బంటు వేనుగోపాల్ ఫామ్‌హౌస్‌కు రోడ్లు వేస్తున్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు అవసరం ఉన్న చోట కాకుండా అనుమతి లేని వెంచర్ల యాజమాన్యాలకు లబ్ధి చేకూర్చేలా పనులు చేపట్టడంతో స్థానిక బీఆర్ఎస్, బీజేపీ నేతలు కాంగ్రెస్ పాలనపై ఫైర్ అవుతున్నారు. కోకట్ పంచాయతీతో పాటు తాండూరు పట్టణంలోని అనేక వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే జనాలు లేని ప్రదేశాల్లో రూ.60 లక్షలు కాంగ్రెస్ నేతలు నిధులు దుర్వినియోగం చేయడంపై స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయం బయటకు రాకుండా కొందరు వ్యక్తులు కాంగ్రెస్ నాయకుడి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. సొంత అవసరాలు, వ్యాపారం కోసం ప్రైవేటు ప్లాట్లు, వెంచర్లు, పొలాల వైపు వేసిన రోడ్ల నిధులను వెంటనే నిలుపదల చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఇలా ప్రజా సొమ్మును దుర్వినియోగం చేసేలా పనులకు అనుమతులు తెలుపడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. వెంటనే పనులు నిలిపి, నిధులను రికవరీ చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేయడానికి బీఆర్ఎస్, బీజేపీ నేతలు సిద్ధమయ్యారు. నిధులు దుర్వినియోగానికి సహకరించిన అధికారిపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



PROPOSED LIST OF WORKS UNDER MGNREGS 2024-25 IN TANDUR CONSTITUENCY

| S.No | Name of the Mandal | Name of the village | Name of the Road | Est Cost (in Lakhs) |
|---|---|---|---|---|
| 1 | Yalal | Kokat | Laying of CC Road from Bantwenu land to Rustum (H) at Kokat Village of Yalal (M) | 15.00 |
| 2 | Yalal | Kokat | Laying of CC Road from Rustum (H) to Pasham Ravi (H) at Kokat Village of Yalal (M) Bit - I | 15.00 |
| 3 | Yalal | Kokat | Laying of CC Road from Rustum (H) to Pasham Ravi (H) at Kokat Village of Yalal (M) Bit - II | 15.00 |
| 4 | Yalal | Kokat | Laying of CC Road from Rustum (H) to Naresh (H) at Kokat Village of Yalal (M) | 15.00 |
| | | | | 60.00 |

2టీడీఆర్4: సీసీ రోడ్ల నిర్మాణ పనులకు రూ.60 లక్షల నిధులను కేటాయించినట్లు అధికారులు సంతకం చేసిన పత్రం

## ఎస్సీ, ఎస్టీ కేసులో నిందితుడికి జీవితఖైదు

ధారూరు, 